సంపాదక మనస్తత్వం :

# సొంతం: అనువాదం

రచన: జి. ప్రభ

ఆ నాడు, పంపుల చెరువుగట్టుకు, నేనూ, ఉదయా కలిసి వెళ్ళాము. ఆ పంపుల చెరువుగట్టుమీద నిలబడి, క్రిందికి చూస్తే, పల్చబడుతున్న సూర్యకాంతికి మా నీడలు, గాలికి ఎగురుతున్న మా జుట్టు ఎగిరింతల చేలగాటల నీడలూ, మా ఉదయ పొడుగాటి పమిట చేతినుండి తప్పి తెరచాపలాగ, ఆ మట్టి బొరియలపైన ,పడుతున్న నీడలూ చూసి ఆనందించాము.

మా ఉదయ అందం మామూలుగా రంగు ముఖంలో చూసినదీ, ఏదో నీడలాగ అగుపించిందీ, ఈ రెంటికీ చాల వ్యత్యాసం వుంది.

మా ఉదయను, ఏడిపించాలనుకున్నాను-

'ఒసెయ్ ! ఆనీడచూడు !' అన్నాను.

"చాలాబావుంది ! ఎంచక్కా !"అంది పాపం అమాయకంగా.

'చీకట్లో...ముగ్గుణ్ణి...' అని చిలిపిగా ఎగురుతూగంతులేశాను—చిన్నప్పుడు, నీడను చూపి, 'చీకట్లో...' అని ఏడిపించిన సంగతులు జ్ఞాపకమొచ్చాయి !

మా ఉదయ ఉడుక్కుంది !

ఉడుక్కొని ఊరుకోదు !! కొట్టడానికొస్తుంది !

నేను పరుగెత్తాను. నా వెనకాల, తరిమింది !

కొంతదూరం పరుగెత్తాక నాకే సిగ్గేసింది— నాకేసి, చూస్తున్న కొందరు కుర్రాళ్ళని చూసి !

నేను లొంగిపోయాను.

నా జడ పట్టుకొని, ఒక గుంజుగుంజి, నాకు డజనున్నర మొట్టికాయలు వేసింది !

పడ్డాను...ఏం చెయ్యను?

'కసితీరిందా ?' అని అడిగాను—

మరో మొట్టికాయవేసి సంతృప్తి పడింది !

ఇదంతా, చక్కగా చిత్రించాను కథగా...

ఇదే విషయానికి ప్రకృతి వర్ణనలూ...గొల్లపిల్లల పాటలూ...పిల్లంగోరు గానమూ...లేగదూడల పరుగులూ...అన్నీ కలిపి, ఒక చక్కటి కథగా, తయారుచేశాను—

ఇది, ఒక పత్రికకు పంపాను !

ఒకపక్షం...రెండుపక్షాలు...మూడు పక్షాలు. ఎంతకూ ప్రచురణ కాలేదు !

మూడు నెలల తరువాత ఆ రచన తిరిగి పంపివేయమని ఆ సంపాదకునికి వ్రాశాను...

జాగ్రత్తగా తిరిగి వచ్చేసింది...

కథను చదువుకున్నాను...నాకు బాగానేవుంది.

ఆ సంపాదకుడికి ఒక లేఖ వ్రాశాను, నా రచన తిరిగి పంపటానికి కారణం తెలుపమని...

ఆయన, ఇలా రాశారు :

"మీ రచనను సాంతం చదివాను...వాక్పటిమగాని, నిర్దుష్టమైన భాషగాని...ఆవేశంగల భావం కాని ఆదర్శంగల కథావస్తువుగాని, విశిష్టతగల గమనికగాని...రచనలో శిల్పంగాని,కళగాని— లేకపోవుటచే..ప్రకటించలేదు-"అని జవాబు వచ్చింది !

సరే, ఒక స్టంటు వేదాం అన్నాను.

అదే రచనను కాపీచేశాను...

'రచన:-పండరీ చెటర్జీ' అని పెట్టి అనువాదం నా పేరు పెట్టి, అదే పత్రికకు పంపాను.

పంపిన, అయిదోరోజున వచ్చిన సంచికలో రచన అచ్చయింది—

పై పెచ్చు ఆ రచనకు, ఉపోద్ఘాతం కూడ ఉంది—

'ఈ బెంగాలీ రచనకు అనువాదాన్ని ప్రచురించడానికి గర్విస్తున్నాం—సామాన్య కథావస్తువు తీసికోవడంలో ప్రత్యేకత ఉంది...కథను నడిపించడంలో విశిష్టత ఉంది...ఉత్కృష్టమైన భావావేశం ఉంది...సహజమైన వర్ణనలు...సాంపైన కథావేగం...పాఠకుణ్ణి లోనికి లాక్కుపోతుంది...రచన చదవండి!" అని ఉంది !

నాకు ఆశ్చర్యం వేయలేదు !